కోతకు ముందే మేతకు!

మొదటిపేజీ తరువాయి...

కనిపిస్తున్నది. పంట చేతికి వచ్చిన తర్వాత గడ్డిని పశువుల మేతకు వేయాల్సింది పోయి.. వరి కోతలకు ముందే మూగజీవాల మేత కోసం పొలాల్లోకి తోలాల్సిన దుస్థితి దాపురించింది. మరి ఈ కరువెట్లా వచ్చింది? అంటే అది కాంగ్రెస్ తెచ్చింది! నీటి నిర్వహణకు తిలోదకాలిచ్చిన ఫలితమిది! ప్రభుత్వ ప్రణాళికలేమికి, సోయిలేని తీరుకు దర్పణమిది! సర్కారు వైఫల్యం అన్నదాతలకు శాపంగా పరిణమించింది. పొట్టదశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు ఇప్పుడు తండ్లాడాల్సి వస్తున్నది. వేలాది రూపాయల పెట్టుబడిపెట్టిన కర్షకలోకం ఇప్పుడు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో ఎండిన వరిపొలంలో పశువులను మేపుతున్న రైతు కనకారెడ్డి

కృష్ణ నుంచి సముద్రంలోకి 844 టీఎంసీలు

కృష్ణా బేసిన్‌లో సమృద్ధిగా వర్షాలు కురిశాయి. బేసిన్‌లోని ఆల్మట్టి మొదలు దిగువన ప్రకాశం బరాజ్ వరకు అన్ని ప్రాజెక్టులూ పొంగి పొర్లాయి. గతేడాది కేవలం 72 టీఎంసీలే సముద్రంలో కలవగా, ఈసారి 844 టీఎంసీల మేరకు జలాలు సముద్రంలో కలిశాయి. అంటే ఎంత భారీగా వరదలు వచ్చాయో అర్థం చేసుకోవచ్చు! అదీగాక కృష్ణాలో నవంబర్ మొదటి వారం వరకు వరద ప్రవాహాలు స్థిరంగా కొనసాగాయి. సముద్రంలో కలిసిన జలాలు పోగా దాదాపు ఇరు రాష్ట్రాలకు కలిపి 1010 పైగా టీఎంసీలు అందుబాటులోకి వచ్చాయి. తాత్కాలిక కోటాలో ఏపీకి 666 టీఎంసీలు కాగా, ఇప్పటికే ఆ రాష్ట్రం కోటాకు మించి జలాలను తరలించుకుపోయింది. మరోవైపు తెలంగాణకు తాత్కాలిక కోటాలో 344 టీఎంసీలు ఉండగా, ఇప్పటికీ 220 టీఎంసీలకు మించి వినియోగించలేదు. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో కలిపి 60 టీఎంసీలు కూడా అందుబాటులో లేని దుస్థితి నెలకొన్నది. మరోవైపు ఇప్పటికీ రాష్ట్ర కోటాలో 124 టీఎంసీలు ఉన్నాయి. యాసంగి సాగు నీటికి, వేసవి తాగునీటికి కలిపి మే నెలాఖరు వరకు దాదాపు 116 టీఎంసీలు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. కానీ రిజర్వాయర్లు ఖాళీ కావడంతో ఇప్పుడు దిక్కుతోచని పరిస్థితి నెలకొన్నది. ప్రస్తుతం అందులో ఉన్న నీటిలోనూ ఏపీకి 20 టీఎంసీలు కేటాయించగా, తుదకు దక్కింది 40 టీఎంసీలు మాత్రమే. దీంతో అంచనాలన్నీ తప్పి ఆ ప్రాజెక్టుల కింద ప్రస్తుతం పంటలు ఎండిపోతున్న దుస్థితి దాపురించింది. అదీగాక వేసవిలో తాగునీటికి తండ్లాక తప్పని పరిస్థితి నెలకొన్నది.

గోదావరిలో నుంచి 4150 టీఎంసీలు

మరోవైపు గోదావరి బేసిన్‌లోనూ సమృద్ధిగా వర్షాలు కురవడంతో భారీగా వరదలు వచ్చాయి. 100 రోజులకు పైగా వరద ప్రవాహాలు కొనసాగాయి. మహారాష్ట్ర ప్రాజెక్టులతో పాటు, శ్రీరాంసాగర్ మొదలు అన్ని మేజర్ ప్రాజెక్టులే కాకుండా మీడియం ప్రాజెక్టులన్నీ పొంగిపొర్లాయి. ఏడాది మొత్తంలో దాదాపు 4150 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. అక్టోబర్ 29 వరకు వరద ప్రవాహాలు భారీగా కొనసాగాయి. ఇప్పటికీ ప్రాణహితలో దాదాపు 8 వేల క్యూసెక్కుల ప్రవాహం వచ్చి గోదావరిలో కొనసాగుతున్నది. అయినా గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల్లోనూ ప్రస్తుతం కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్సారెస్పీ ఆయకట్టు సైతం ఎండుతున్నది. ఎస్సారెస్పీకి ఈ ఏడాది జూలై 17న నుంచి వరద ప్రవాహాలు నవంబర్ మొదటి వారం దాకా కొనసాగాయి. దాదాపు నాలుగు సార్లు గేట్లు తెరిచారు.

కొరవడిన ప్రణాళిక..

సమృద్ధిగా వర్షాలు కురిసినా రాష్ట్రంలో నీటి కటకట ఏర్పడడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలిసిపోతున్నది. గత బీఆర్ఎస్ సర్కారు సాగు తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికబద్ధంగా ముందుకుపోయింది. తెలంగాణ నీటి వనరులకు ఆయువుపట్టయిన చెరువుల సంరక్షణ, పునరుద్ధరణపై కేసీఆర్ సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేసింది. తద్వారా రెండు పంటలకు సాగునీటి భరోసా లభించింది. యాసంగిలోనూ నిరందిగా పంటలు పండించుకునే పరిస్థితి ఉండేది. రాష్ట్రంలోని వేలాది చెరువులను అక్కడి మేజర్, మీడియం ప్రాజెక్టులకు గత ప్రభుత్వం అనుసంధానం చేసింది. ప్రధాన గోదావరిలో ఎగువ నుంచి ప్రవాహాలు తగ్గిన వెంటనే మేడిగడ్డ నుంచి ప్రాణహిత జలాలను ప్రధాన ప్రాజెక్టులకు ఎత్తిపోసేది. ఆ జలాలను ప్రాజెక్టుల ద్వారా చెరువులకు మళ్లించేది. ఇలా ప్రతి అక్టోబర్ లేదా డిసెంబర్‌లో చెరువులు, చెక్‌డ్యామ్‌లను క్రమం తప్పకుండా నింపేది. ఫలితంగా భూగర్భజలాలు పడిపోకుండా ఉండేవి. 24 గంటల పాటు కరెంట్ ఇవ్వడంతో బోర్ల ద్వారా పంటలు పండేవి. చిన్న లిఫ్టులను కూడా సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు ఈ ఏడాది ఆ పనేమీ చేయలేదు. ఫలితంగా భూగర్భజల మట్టాలు తీవ్రంగా పడిపోతున్నాయి. మరోవైపు కరెంటు కోతల వల్ల బోర్లు కూడా పూర్తి స్థాయిలో నడవని దుస్థితి నెలకొన్నది. దీంతో కొన్నిచోట్ల నీళ్లు లేక పంటలు ఎండుతుంటే.. మరోవైపు నీళ్లున్నా పంటలు ఎండిపోతున్నాయి. ఇది ప్రభుత్వ ప్రణాళికారాహిత్యమేనని స్పష్టంగా అర్థమవుతున్నది.

అధికారులు హెచ్చరించినా పెడచెవిన..

ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, కడెం, నిజాంసాగర్, సింగూరు, నాగార్జునసాగర్, శ్రీశైలం తదితర మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో డిసెంబర్ మొదటివారం నాటికి తాగునీటి అవసరాలు పోగా 354.88 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయని రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (ఎస్‌సీఐఈఏఎం) లెక్కతేల్చింది. ఈ యాసంగిలో మొత్తంగా 42.48 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని ప్రతిపాదించింది. మేజర్ ప్రాజెక్టుల్లో 277.59 టీఎంసీలు అందుబాటులో ఉండగా, వాటి కింద 30.96 లక్షల ఎకరాలకు, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో 30.38 టీఎంసీలుంటే 2.68 లక్షల ఎకరాలకు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 37.40 టీఎంసీలతో 7.23 లక్షల ఎకరాలకు, ఐడీసీ లిఫ్టుల కింద 9.5 టీఎంసీలతో 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని అంచనాలు రూపొందించింది. వెట్‌క్రాప్స్‌కు 24.54 లక్షల ఎకరాలు, ఐడీ క్రాప్స్‌కు 17.94 లక్షల ఎకరాలు మొత్తంగా 42.48 లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు కమిటీ తైబందీ ఖరారు చేసింది. జనవరి 1 నుంచి మార్చి 31వరకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో అంటే వారం విడిచి వారం మొత్తంగా 6 తడులను అందించాలని నిర్ణయించింది. రాష్ట్ర స్థాయి కమిటీ రూపొందించిన అంచనాలు క్షేత్రస్థాయి పరిస్థితులకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని ఫీల్డ్‌లోని ఇంజినీర్లు మొదటినుంచీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ వస్తున్నారు. ఇదిలాఉంటే ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించి చేతులు దులుపుకొన్నదే తప్ప ఆ దిశగా నిల్వలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించింది లేదు. కృష్ణా నదీ జలాల్లో ఏపీ తాత్కాలిక కోటా 512 టీఎంసీలే కానీ ఇప్పటి వరకు ఏకంగా 650 టీఎంసీలను మళ్లించుకుపోయింది. నవంబర్ నుంచే శ్రీశైలం, సాగర్‌ల నుంచి భారీగా జలాలను మళ్లించడం మొదలుపెట్టింది. ఒకానొక దశలో గడచిన 25 రోజుల్లోనే ఏకంగా 60 టీఎంసీలను మళ్లించుకుపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు! రోజుకు నికరంగా 2 టీఎంసీలకు మించి జలాలను ఏపీ మళ్లించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క పోతిరెడ్డిపాడు ద్వారా 8 నెలల్లోనే 245 టీఎంసీలకు పైగా జలాలను పెన్నా బేసిన్‌కు తరలించింది. ఏపీ జలాలను మళ్లిస్తున్న విషయాన్ని రాష్ట్ర అధికారులు నవంబర్‌లోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినా సర్కారు పెడచెవిన పెట్టింది. బోర్డును నిలదీసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. మరోవైపు మేడిగడ్డ బరాజ్ ఘటనను సాకుగా చూపి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టడంతో ఎస్సారెస్పీ-2తోపాటు, నిజాంసాగర్, రంగనాయకసాగర్ ఆయకట్టు సైతం ఎండిపోయే దుస్థితి వచ్చిపడింది.

రైతన్నల ఆగమాగం..

కాంగ్రెస్ సర్కారు అవగాహనా రాహిత్యం, ప్రణాళిక లేమితో ప్రస్తుతం రైతులు ఆగమవుతున్నారు. నీరిస్తామని పత్రికాముఖంగా ప్రకటించిన ప్రభుత్వం ప్రస్తుతం పంటలు పొట్టకు వచ్చే దశలో చేతులెత్తేసింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. చెరువులను నింపకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి బోర్లన్నీ చిన్నబోతున్నాయి. వాటి కింద సాగు ప్రశ్నార్థకంగా మారింది. కరెంటు కోతలు కూడా కొనసాగుతుండడంతో బోరు బావుల కింద వ్యవసాయం సజావుగా సాగని దుస్థితి నెలకొన్నది. రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది రైతులు పంటలపై ఆశలు వదులుకొని పశువుల మేతకు వదిలేశారు. ఎకరాన దాదాపు 20-25 వేల పెట్టుబడి పెట్టిన రైతులు ప్రస్తుతం పంటలను కాపాడుకొనేందుకు రోడ్డెక్కుతున్నారు. ట్యాంకర్లను పెట్టి కొద్దిమొత్తంలోనైనా పంటను కాపాడుకునేందుకు తండ్లాడుతున్నారు.

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చీకోడులో ఎండిన వరిపైరు

వర్షపాతం

2025, మార్చి 3 వరకు రాష్ట్ర సాధారణ వర్షపాతం :	నమోదైన వర్షపాతం:
864.9 మి.మీ	1049.5 మి.మీ

అత్యధిక వర్షపాతం నమోదైన మండలాలు :	358
సాధారణ వర్షపాతం నమోదైన మండలాలు :	316
అత్యల్ప వర్షపాతం నమోదైన మండలాలు :	8

తెలంగాణ ప్రాజెక్టుల్లో నీటి నిల్వల వివరాలు టీఎంసీల్లో..

రిజర్వాయర్	పూర్తిస్థాయి నిల్వ	ప్రస్తుత నిల్వ	ఫిబ్రవరి	జనవరి	డిసెంబర్	నవంబర్..
జూరాల	9.66	05.09	5.56	7.66	8.99	9.48
శ్రీశైలం	215.81	74.81	86.29	110.07	120.95	190.33
నాగార్జునసాగర్	312.05	164.46	210.88	255.31	305.75	306.69
సింగూరు	29.91	22.57	25.03	27.85	29.10	29.80
నిజాంసాగర్	17.80	08.91	12.57	14.84	17.69	17.80
శ్రీరాంసాగర్	80.50	32.14	47.28	73.37	80.50	80.50
కడెం	7.60	4.76	5.45	06.30	6.74	6.47
ఎల్లంపల్లి	20.18	13.09	15.81	18.70	20.18	20.18
మిడ్‌మానేరు	27.50	7.22	–	–	25.60	27.50
లోయర్‌మానేరు	24.07	12.07	15.65	21.88	23.60	24.50



వేసవికి ముందే రిజర్వాయర్లు ఖాళీ!

గోదావరి, కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యానికి చేరుకోవడంతోపాటు పొంగిపొర్లాయి. అక్టోబర్ 25 నాటికి సైతం శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ మట్టానికి చేరుకోగా 215 టీఎంసీలతో కళకళలాడింది. కానీ ప్రస్తుతం 74.81 టీఎంసీలకు చేరుకొని అడుగంటింది. వేసవి రాకముందే నీటినిల్వలన్నీ అడుగంటి పోయాయి. ఇంకా యాసంగి మధ్యలో ఉండగానే శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో నీటినిల్వలు ఖాళీ అయ్యాయి. శ్రీశైలం రిజర్వాయర్‌ను ఏపీ సర్కారు ఖాళీ చేసింది. వాస్తవ డెడ్ స్టోరేజీ 834 అడుగులు కాగా, ఈ సీజన్‌లో 820గా నిర్ధారించారు. అయినా ప్రస్తుతం అక్కడ కేవలం 28 టీఎంసీలే వినియోగానికి అందుబాటులో ఉన్నాయి. రిజర్వాయర్‌పై ఆధారపడి ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు మొత్తంగా 7 జిల్లాలకు సాగునీరు అందించాల్సి ఉన్నది. యాసంగి అవసరాలను కూడా తీర్చాల్సి ఉన్నది. నాగార్జునసాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజీ 510 అడుగులు కాగా ఈ ఏడాది 515 ఫీట్లుగా నిర్ధారించారు. అక్కడ ప్రస్తుతం 34 టీఎంసీలు కూడా లేని దుస్థితి నెలకొన్నది. రెండు రిజర్వాయర్లలో కలిపి నికరంగా 60 టీఎంసీలు కూడా అందుబాటులో లేవు. జూరాల, గోదావరి బేసిన్‌లోని ఎస్సారెస్పీ, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, ఎల్లంపల్లి, కడెం తదితర ప్రాజెక్టులన్నీ అండుగంటుతున్నాయి. మరోవైపు సాగర్ ఎడమ కాలువ కింద 6.50 లక్షల ఆయకట్టుతోపాటు, హైదరాబాద్ సహా ఇతర జిల్లాల తాగునీటి అవసరాలను తీర్చాల్సి ఉన్నది. కానీ రెండు రిజర్వాయర్లు ఖాళీ అవడంతో ప్రస్తుతం ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది.

- **ట్యాంకర్ తెచ్చి పొలానికి నీరు**

మెదక్ జిల్లా చేగుంట మండల రుక్మాపూర్‌కు చెందిన రైతు చంద స్వామికి చెందిన బోర్లు వట్టిపోయాయి. దీంతో పంట ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. పంటను కాపాడుకునేందుకు స్వామి వెయ్యి రూపాయలకు ఒక ట్యాంకర్ చొప్పున నీటిని తెచ్చి పొలం పారిస్తున్నాడు.

- **నారాయణపూర్ రిజర్వాయర్ మత్తడికి గండి**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ చెరువు మత్తడికి గుర్తుతెలియని వ్యక్తులు గండికొట్టారు. సోమవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన స్థానికులు మత్తడికి గండిపడి నీరు వృథాగా పోతుండటాన్ని గమనించి ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు.

రైతు బీమాకు కిస్తీ కట్టలేదు

మొదటిపేజీ తరువాయి...

అందేది. తద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా దక్కేది. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో రైతుబీమా పరిహారం కూడా కరువైంది. కాంగ్రెస్ సర్కారు ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకపోవడమే ఇందుకు కారణం. 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం రైతుల తరుపున చెల్లించాల్సిన ప్రీమియంను ఇప్పటివరకు చెల్లించలేదని సమాచారం. దీంతో మరణించిన రైతుల కుటుంబాలకు పరిహారం అందడంలో జాప్యం జరుగుతున్నట్టు తెలిసింది.

విడతలవారీగా చెల్లింపులు

ఇంటి పెద్ద దిక్కుగా ఉన్న రైతు మరణిస్తే ఆ కుటుంబం రోడ్డును పడొద్దనే ఉద్దేశంతో నాటి సీఎం కేసీఆర్ రైతుబీమా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. ఏటా ఆగస్టులో ఒకేసారి సుమారు 40 లక్షల మంది రైతులకు రూ.1,450 కోట్లకు పైగా ఎల్ఐసీకి కేసీఆర్ సర్కారు ప్రీమియం చెల్లించేది. కానీ, కాంగ్రెస్ హయాంలో ఇది విడతలవారీగా మారింది. గత ఆగస్టులో ప్రభుత్వం రూ.700 కోట్లు చెల్లించింది. మిగిలిన సుమారు రూ.750 కోట్లను ఆర్నెళ్ల తర్వాత అంటే ఫిబ్రవరిలో చెల్లించాల్సి ఉంది. కానీ, ప్రభుత్వం ఈ మొత్తాన్ని ఎల్ఐసీకి చెల్లించలేదని తెలిసింది. ఎప్పటిలోపు చెల్లిస్తుందో కూడా స్పష్టత లేకపోవడం గమనార్హం. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి నిధుల కోసం వ్యవసాయ శాఖ లేఖ రాసినట్టు తెలిసింది. కానీ, ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి సమాధానం రాలేదని సమాచారం.

పరిహారం మంజూరు ఆలస్యం

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కారణాలతో మరణించిన సుమారు 2 వేల మందికి పైగా రైతు కుటుంబాలకు రైతుబీమా పరిహారం పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. ఇందులో కొన్ని ఎల్ఐసీ వద్ద ఉండగా.. మరి కొన్ని డీఏవోల వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. వాస్తవానికి బీఆర్ఎస్ హయాంలో ఏటా తంచనుగా రైతుబీమా ప్రీమియం చెల్లించడంతో రైతుల కుటుంబాలకు త్వరగా పరిహారం మంజూరయ్యేది. కానీ, ఇప్పుడు ప్రీమియం చెల్లింపుల్లో ఆలస్యం కారణంగా పరిహారం మంజూరులోనూ ఆలస్యమవుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుడు జూలై నాటికి సుమారు 3 వేలకు పైగా కుటుంబాలకు పరిహారం పెండింగ్‌లో ఉండడం గమనార్హం. అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రైతుల కుటుంబాలు ఆగమాగం

ఓ వైపు కరువు.. మరోవైపు పండించిన పంటను అమ్ముకోలేని దుస్థితి. ఎరువులకు గోస, నీళ్లకు గోస, కరెంట్ గోస.. వీటికి తోడు ప్రభుత్వం నుంచి అందని రైతుభరోసా వెరసి రైతులు కాంగ్రెస్ పాలనలో రైతులు ఆగమాగమవుతున్నారు. ఇన్ని కష్టాలకు తట్టుకోలేక, చేసిన అప్పులు భరించలేక రైతులు తనువు చాలిస్తున్నారు. సగటున రోజుకి ఒకరు చొప్పున బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ విధంగా ఇప్పటికే 450 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు ఓ అంచనా. వారే కాకుండా ప్రమాదాలు, అనారోగ్యం, ఇతర కారణాలతో వందల మంది రైతులు మరణించారు. ఈ రైతు కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి అనాథలయ్యాయి. పరిహారం అందక అరిగోస పడుతున్నాయి. దీంతో కాంగ్రెస్ సర్కారుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హస్తం పాలనలో బతికినా.. చచ్చినా కష్టమేనని మండిపడుతున్నారు.

గంధం లక్ష్మి (ఫైల్)

పిట్ల రాజు (ఫైల్)

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

దిగుబడులు రాక.. అప్పులు తీర్చలేక

మనస్తాపంతో అన్నదాతల బలవన్మరణం

వరంగల్, మెదక్ జిల్లాల్లో విషాదం

దుగ్గొండి/మనోహరాబాద్, మార్చి 3: సరైన దిగుబడులు లేక.. అప్పులను తీర్చలేక మనస్తాపంతో ఓ ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలు వరంగల్, మెదక్ జిల్లాలో చోటుచేసుకున్నాయి. బాధిత కుటుంబాలు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన వెంకటయ్య, గంధం లక్ష్మి (52) దంపతులు. వీరికి రెండు ఎకరాలు ఉండగా పత్తి సాగు చేశారు. కాగా ఓ రైతుకు చెందిన 6 ఎకరాలు కౌలుకు తీసుకుని మూడు ఎకరాల్లో మిర్చి, మరో మూడు ఎకరాల్లో మక్క జొన్న సాగుచేశారు. సరైన దిగుబడులు రాక రూ.10 లక్షల వరకు అప్పులయ్యాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక లక్ష్మి తీవ్ర మనోవేదనకు గురయ్యేది. ఈ క్రమంలో గత నెల 27న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. భర్త వెంకటయ్య ఇంటికి వచ్చి చూడగా అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మిని వెంటనే నర్సంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేర్పించాడు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి భర్త వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో మెదక్ జిల్లాలో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మనోహరాబాద్ ఎస్సై సుభాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్‌కు చెందిన రైతు పిట్ల రాజు (44)కు ఎకరం పొలం ఉండేది. సాగు కలిసి రాకపోగా, దిగుబడి లేక పోవడంతో ఇంటి నిర్మాణం కారణంగా అప్పుల పాలయ్యాడు. దీంతో ఉన్న ఎకరం భూమి కూడా అమ్ముకున్నాడు. ఇటీవల పెద్ద కుమార్తెకు పెండ్లి కుదిరింది. ఆర్థిక ఇబ్బందులతో కొద్దిరోజులుగా ఆందోళనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన ఆయన సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత ఎంతకీ ఇంటికి రాకపోవడంతో పొలం వద్దకు వెళ్లిచూడగా చెట్టుకు ఉరివేసుకుని విగత జీవిగా కనిపించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అక్రమాలకు ఎల్ఆర్ఎస్!

మొదటిపేజీ తరువాయి...

చేయకుండా పది శాతం ఫీజును మినహాయించుకొని మిగిలిన 90 శాతం తిరిగి చెల్లిస్తానంటున్నది. అంటే ఖజానా నింపుకునేందుకు కనీసం కించిత్తు పరిశీలన లేకుండానే దరఖాస్తుదారుల నుంచి ఎల్ఆర్ఎస్ మొత్తాన్ని వసూలు చేసేందుకు రాష్ట్ర సర్కారు సిద్ధమవుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో 28 రోజుల్లో ముగియనుండగా.. ఈలోగా జనం నుంచి అందినంత ఖజానాలో వేసుకునేందుకు అక్రమాలకు గేట్లు తెరిచింది. రాష్ట్రంలో సీఎంగా రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పడిపోయింది. గత బడ్జెట్ లోటు 30-40 శాతం ఉన్నట్టు తెలుస్తుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఆ లోటును పూడ్చుకొనేందుకు ఎల్ఆర్ఎస్‌ను మాధ్యమంగా ఎంచుకున్నది.

భూమి ఏదైనా ముందైతే ఫీజు కట్టు.

ఎల్ఆర్ఎస్‌లో భాగంగా అనధికారిక లేఅవుట్ యజమానులు, ప్లాటుదారులు నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుంటారు. దానిని మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలిస్తారు. అన్నీ సక్రమంగా ఉంటేనే ఎల్ఆర్ఎస్ కింద 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు కట్టాలని నోటీసు ఇస్తారు. దరఖాస్తుదారుడు ఆ మొత్తాన్ని చెల్లించాక స్థానిక సంస్థల నుంచి ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్ జారీచేస్తారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వీటికి తిలోదకాలిచ్చింది. చరిత్రలో ఎన్నడూలేని విధంగా ముందైతే 25 శాతం రిబేటును మినహాయించుకొని 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలను చెల్లించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. ఆ తర్వాత దరఖాస్తులను పరిశీలించి.. అది అక్రమమా? సక్రమమా? తేలుస్తామని అంటున్నది. లేఅవుట్ గానీ, ప్లాటుగానీ నిషేధిత జాబితాలోని భూముల్లో ఉన్నా, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్నా ఓపెన్ స్పేస్ చార్జీలను చెల్లించాలంటూ ఈ నెల 31 వరకు గడువు ఇచ్చింది. లేఅవుట్లకు మాత్రం 26.8.2020 నాటికి పది శాతం ప్లాట్లు అమ్మినట్టుగా రిజిస్ట్రేషన్ విక్రయ దస్తావేజులు ఉండాలనే షరతు మాత్రమే పెట్టింది. అంటే ఫీజు చెల్లింపునకు ముందు అధికార యంత్రాంగం ఏమాత్రం రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన చేయరని ప్రభుత్వమే అధికారిక ప్రకటనలో పేర్కొనడం గమనార్హం.

28 రోజులు.. రూ.3 వేల కోట్లు లక్ష్యం!

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెచ్చిన ఎల్ఆర్ఎస్-2020 కింద రాష్ట్రవ్యాప్తంగా 25.60 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు వీటిలో సుమారు తొమ్మిది లక్షల వరకు దరఖాస్తులను పరిశీలించగా ఇంకా 16.60 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. హెచ్ఎండీఏ, మున్సిపాలిటీల్లో సరైన సిబ్బంది లేక.. ప్రధానంగా సర్వేయర్లు లేక పరిశీలన ప్రక్రియ ఎప్పుడో అటకెక్కింది. ప్రభుత్వానికి అక్రమాలను కట్టడి చేయాలనే చిత్తశుద్ధి ఉన్నట్లయితే ఈ తొమ్మిది లక్షల దరఖాస్తుల నుంచి ఎల్ఆర్ఎస్ ఫీజులను వసూలు చేయాలి. కానీ ఇలా కాకుండా అక్రమమా? సక్రమమా? అనే దానితో సంబంధం లేకుండా ముందుగా ఓపెన్ స్పేస్ చార్జీల చెల్లింపునకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పైగా సాధ్యమైనంత మేరకు ఎల్ఆర్ఎస్ కింద ఫీజులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు టార్గెట్లు కూడా ఇచ్చారు. ఇలా ప్రభుత్వం రానున్న 28 రోజుల్లో రూ.3వేల కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా విధించింది.

ఏండ్లలో కానిది పది రోజుల్లో తేలుస్తారా?

సరైన సిబ్బంది లేకపోవడంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ఏండ్లుగా నత్తనడకన సాగుతున్నది. ఈ క్రమంలో ఈ నెల 31 వరకు చకచకా ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించేందుకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం.. ఆ తర్వాత పది రోజుల్లో ప్రాసెస్ (పరిశీలన, ప్రొసీడింగ్‌ల జారీ)ను పూర్తిచేయనున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే 16.60 లక్షల దరఖాస్తులు పెండింగ్ ఉండగా, కొత్తవాటికి అవకాశం ఇవ్వడంతో మరో ఐదు లక్షల వరకు వచ్చే అవకాశమున్నట్టు అంచనా వేస్తున్నారు. 2020 నుంచి ఇప్పటివరకు తొమ్మిది లక్షల దరఖాస్తుల పరిశీలన జరిగితే... 21-22 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యేందుకు ఎంత సమయం పడుతుంది? అవి అక్రమమా? సక్రమమా? అని తేల్చేందుకు ఇంకెంత సమయం కావాలి? అప్పటివరకు దరఖాస్తుదారులు చెల్లించిన మ